

భగభగలు



- జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఏప్రిల్‌లోనే మే నెలను తలపిస్తున్న ఎండలు
- అల్లాడుతున్న ప్రజలు

పెద్దాపురం, ఏప్రిల్ 7: ఉదయం 9 గంటలైతే బయటకు వెళ్లలేని పరిస్థితి. సాయంత్రం 5 గంటలు దాటితే బయటకు రాలేని దుస్థితి. ఏప్రిల్లోనే మే నెలను తలపించే ఎండలు జిల్లావాసులను చిర్రెత్తిస్తున్నాయి. ఈ వారంలో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు మంటలు పుట్టిస్తున్నాయి. ప్రస్తుతం మే నెలలో ఉన్నంత ఎండలు ప్రజలను భయపెడుతున్నాయి. మరో వారంరోజుల్లో ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు సూచనలు చేస్తున్నారు. ఇప్పటికే నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడిపోతున్నారు.


గండేపల్లి శివారులో హైవేపై చెట్ల కింద నిలిపివేసిన లారీలు

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

మరోరెండురోజుల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగుతాయని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. రోజుకు 0.1 నుంచి 0.5 డిగ్రీల వరకూ పెరుగుదల ఉంటుందని చెప్తున్నారు. ప్రస్తుతం ఎల్‌నినో ఛాయలు ఉన్నందున ఈ ఏడాది ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తున్నారు. పెద్దాపురంలో బుధవారం 37 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు పైబడి నమోదయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎండలకు హడలిపోతున్న వాహనదారులు


గండేపల్లి, ఏప్రిల్ 7: పది రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సూర్యుడి భగభగలతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. లారీలు, పెద్ద వాహనాల డ్రైవర్లు జాతీయరహదారిపై మధ్యాహ్న సమయంలో ఎండల ధాటికి వాహనాలు నడపలేకపోతున్నారు. దీంతో జాతీయరహదారిని ఆనుకుని ఉన్న చెట్ల కింద నీడ ప్రాంతంలో లారీలు నిలిపివేస్తున్నారు. సాయంత్రం వాతావరణం చల్లబడ్డాక తిరుగు ప్రయాణమవుతున్నారు. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

వడదెబ్బపట్ల అప్రమత్తంగా ఉండాలి

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 7: వేసవికాలం తీవ్ర రూపం దాల్చి వడగాల్పులు వీస్తున్న తరణంలో చిన్నపిల్లలు, వృద్ధులు వడదెబ్బ బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. వడదెబ్బ బారిన పడిన వారి శరీర ఉష్ణోగ్రత 105.1 ఎఫ్ కంటే ఎక్కువ కలిగి ఉంటుంది. చర్మం పొడిబారి పోతుంది. మూత్రం గాఢ పసుపు రంగులో ఉండి మంట పుడుతుంది. తద్వారా సొమసిల్లి పడిపోతారు. ఇందుకు ముఖ్యకారణం నీరు తక్కువగా తీసుకోవడం, మత్తుపానీయాలు ఎక్కువగా సేవించడం, ఎండలో ఎక్కువగా తిరగడం, వృద్ధులకు వయస్సుకు సంబంధించిన శారీరక మార్పులు జరగడం వంటివి. దీనికి నివారణా మార్గం ఎండలో ఎక్కువగా తిరగకుండా నీడపట్టున ఉండాలి. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు. వడదెబ్బ బారిన పడిన వారిని వీలైనంత తొందరగా ఆస్పత్రికి తరలించి అపస్మారక స్థితిలో ఉంటే ఐవీ డ్రిప్ పెట్టి రోగి బిపి, పల్స్‌ను ఎప్పటికప్పుడు గమనిస్తూ వైద్య చికిత్సను అందించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు ఉదయం 11 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలోకి వెళ్లకుండా ఉండడం శ్రేయస్కరం. జిల్లావ్యాప్తంగా ఆరోగ్య సిబ్బంది గ్రూప్ మీటింగ్స్ ద్వారా ఓఆర్ఎస్ డిమాన్‌స్ట్రేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి.

-డాక్టర్ జె.నరసింహనాయక్, డీఎంహెచ్‌వో, కాకినాడ

దాహం తీరేనా?


సామర్లకోట వేసవి జలాశయంలో అడుగంటిన నీటినిల్వలు

- సామర్లకోటలో వేసవి జలాశయం, మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్‌ల్లో అడుగంటిన నీటినిల్వలు
- మూడు పట్టణాలకు దాహార్తి సమస్య తప్పేనా?

సామర్లకోట, ఏప్రిల్ 7: సామర్లకోట, పెద్దాపురం మున్సిపల్ పట్టణాలతోపాటు కాకినాడ నగరపాలక సంస్థకు చెందిన ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు సామర్లకోట పట్టణ శివారున ఉన్న వేసవిజలాశయం, మహర్షి సాంబమూర్తి రిజర్వాయర్‌ల్లో నీటినిల్వలు అడుగంటాయి. వేసవి ప్రారంభంలోనే ఇవి అడుగంటడం వల్ల రానున్నకాలంలో మూడు పట్టణాల ప్రజలకు దాహార్తి సమస్య పొంచిఉందని పలువురు ఆందోళన చెందుతున్నారు.

సామర్లకోట గోదావరి కాలువనుంచి విడుదలయ్యే జలాలను ఈ రెండు జలాశయాల్లోకి మళ్లించి జలాశయాలను నింపి ఆ నీటిని క్లోరినేషన్ చేసి పైపుల ద్వారా సామర్లకోట, పెద్దాపురం, కాకినాడ పట్టణాలకు నిత్యం పంపింగ్ చేస్తారు. ఇలా మూడు పట్టణాలకు రోజుకు 22 ఎంఎల్‌డీ పరిమాణంగల క్లోరినేషన్ నీటిని జలాశయాలనుంచి వినియోగిస్తారు. రెండురోజులుగా జలాశయాల్లో నీటినిల్వలు అడుగంటడం, గోదావరి కాలువనుంచి నీటి విడుదలలు అంతంత మాత్రంగానే ఉండడంతో రోజురోజుకూ జలాశయాల్లో నీటినిల్వలు అడుగంటడంతో ప్రమాద పరిస్థితికి చేరాయి. గోదావరి కాలువలో నీటి విడుదల అవుతున్న సమయంలో నీటిని జలాశయాల్లోకి మళ్లించక పోవడంవల్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రతిఏటా తాగునీటి ఎద్దడి తప్పడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. దీంతో ఇప్పటికే పట్టణాల ప్రజలకు అరకొరగా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రజలు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరిస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం సత్వరం స్పందించి రెండు జలాశ యాలకు గోదావరి నీటిని మళ్లించేందుకు ఏర్పాట్లు చేపట్టా లని పలువురు కోరుతున్నారు.

బ్లాక్‌లో మద్యం!


సామర్లకోటలో ప్రభుత్వ మద్యం దుకాణంలో విక్రయాలు నిలిపివేసిన దృశ్యం

- ఎన్నికల సంఘం ఆదేశాలతో మద్యం దుకాణాల్లో పరిమితంగా విక్రయాలు.. మధ్యాహ్నానికి కోటా పూర్తి
- అయినా బెల్ట్ దుకాణాల్లో అధిక ధరకు విరివిగా అమ్మకాలు
- నష్టపోయిన మందుబాబులు
- పట్టించుకోని అధికారులు

సామర్లకోట, ఏప్రిల్ 7: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలకు కంట్రోల్ పేరిట ప్రకటించి సమీపంలోనేగల బెల్ట్ దుకాణాలలో ఎమ్మార్పీ కంటే అదనంగా ఒక్కొక్క సీసాకు రూ.20 నుంచి రూ.30 చొప్పున అదనంగా విక్రయిస్తున్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని మద్యం దుకాణాల్లో గతేడాది ఇదే రోజునాటికి ఎంతమేర మద్యం విక్రయాలు సాగించారో అంతే మద్యాన్ని నేడు కూడా విక్రయించాలని ఆదేశించడంతో ఒక్కొక్క మద్యం దుకాణంలోనూ 800 నుంచి 850 బాటిళ్లు మాత్రమే విక్రయించడంతో ఆదివారం ఉదయం 11 గంటలకే అన్ని మద్యం దుకాణాల్లో నిర్దేశించిన కంట్రోల్ మద్యం విక్రయాలు పూర్తయ్యాయి. ఏపీబీసీఎల్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని మద్యం దుకాణాలు రాత్రి వరకూ తెరిచే ఉంచారు తప్ప మద్యం విక్రయాలను కొనసాగించలేకపోయారు. దీంతో మందు బాబులు మద్యం కొనుగోళ్లకు వచ్చి విక్రయాలు లేవని దుకాణదారుల సమాధానాలతో నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద కంట్రోల్ మద్యం పేరిట ముందే ఆయా దుకాణాల సమీపాల్లోని బడ్డీ కొట్టులకు పెద్దమొత్తంలో మద్యం విక్రయించడంతో ఆయా దుకాణదారులు ఒక్కొక్క బాటిల్‌కు రూ.20 నుంచి రూ.30 చొప్పున అదనంగా విక్రయిస్తూ మద్యం బెల్ట్ దుకాణదారులు లాభపడ్డారు, ఇందులో ప్రభుత్వ మద్యం దుకాణదారులకు కూడా వాటాలు ఉండడంతో మద్యంప్రియులు తీవ్ర ఆర్థిక దోపిడీకి గురయ్యారు.

జగన్ ప్రభుత్వంలో నిరుద్యోగులుగా మిగిలిన యువత


కిర్లంపూడిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

- వలంటీర్ వ్యవస్థకు టీడీపీ వ్యతిరేకం కాదు
- పెన్షన్ ప్రవేశపెట్టింది టీడీపీ హయాంలో ఎన్టీఆర్
- కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రూ.4వేల పెన్షన్ అమలు
- అన్నా క్యాంటీన్లు ప్రారంభం
- కిర్లంపూడి ఆత్మీయ సమావేశంలో టీడీపీ నాయకులు

కిర్లంపూడి, ఏప్రిల్ 7: జగన్ ప్రభుత్వంలో యువత నిరుద్యోగులుగా మిగిలిపోయారని, కూటమి అధికారంలోకి రాగానే రూ.4వేల పింఛన్ అమలు చేస్తామని టీడీపీ నేతలు తెలిపారు. కిర్లంపూడిలో మాజీ జడ్పీటీసీ, ప్రతిపక్ష నేత తోట నవీన్ స్వగృహంలో టీడీపీ రాష్ట్ర నాయకుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. టీడీపీ జగ్గంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ సమక్షంలో జరిగిన ఆత్మీయ సమావేశానికి టీడీపీ జోన్2 కోఆర్డినేటర్ సుజయ్ రంగారావు, శాసనమండలి ప్రతి పక్ష నేత యనమల రామకృష్ణుడు, ఎమ్మెల్సీ చిక్కాల రామచంద్రరావు, పెద్దాపురం, కాకినాడ, ప్రత్తిపాడు కూటమి అభ్య ర్థులు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, మాజీ ఎమ్మెల్యేలు వర్మ, పిల్లి అనంతలక్ష్మిసత్తిబాబు, పారిశ్రామికవేత్త సానా సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ జోన్2 కోఆర్డినేటర్ సుజయ రంగారావు మాట్లాడుతూ జనసేనాని పవన్‌కల్యాణ్ పిఠాపురం నుంచి పోటీ చేయడం కాకినాడ పార్లమెంటుకు అత్యంత ప్రతిష్ఠాత్మకమైనదన్నారు. వైసీపీవల్ల ప్రజలు పూర్తిగా విసుగు చెందారని, అవినీతి ఎంత పెద్దఎత్తున జరిగిందో అందరికీ తెలిసిందేనని అన్నారు. కాకినాడ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు గెలిచి తీరాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేదలను ఆదుకున్నామని జగన్ చిత్రీకరిస్తున్నారు తప్ప చేసేందేమీలేదన్నారు. జగన్ సీఎం అయ్యాక చంద్రబాబు చేసిన ప్రజా కార్యక్రమాలు పక్కన పెట్టేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. వలంటీర్ వ్యవస్థకు కూటమి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. వలంటీర్లను రాజీనామా చేయించి రాజకీయం చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ మొదటినుంచి టీడీపీ ఒక సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న పార్టీ అన్నారు. సంక్షేమ పథకాలు తమవేనని వైసీపీ చెప్పుకుంటుందని, అవి పచ్చి అబద్ధాలని అప్పట్లోనే ఎన్టీఆర్ ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ప్రారంభించారని తెలిపారు. కూటమి ఏర్పడిన తర్వాత కొంతమంది త్యాగం చేశారని, కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రకాలైన నామినేటెడ్ పోస్టులతో వారందరికీ న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందన్నారు. నెహ్రూ సీఎంతో గట్టిగా మాట్లాడి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు తెచ్చుకునే మనిషి అని ఆయనను గెలిపించుకోవడం నియోజకవర్గానికి ఎంతో అవసరమని అన్నారు. జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ నిత్య పోరాట యోధుడు, నిబద్ధత, నీతివంతమైన నాయకులు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్‌కల్యాణ్ కలయికతో సుస్థిరమైన ప్రభు త్వం రాబోతోందన్నారు. తన నియోజకవర్గమైన జగ్గంపేట వ్యవసాయకంగా ఆధారపడ్డ ప్రాంతమని, వైద్య, విద్య అంతంతమాత్రంగానే ఉందని, పారిశ్రామికంగా ఎటువంటి అభివృద్ధి లేదని అన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కిర్లంపూడికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ప్రతిపాదన తీసుకొస్తే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఐదేళ్లలో జీవో అమలు చేయలేకపోయిందన్నారు. ఏలేరు ఆధునికీకరణ పునర్వ్యవస్థీకరణ చేసి ప్రతి ఎకరానికి సాగునీరు కల్పించే ఉద్దేశ్యంతోనే పోటీలో నిలబడుతున్నట్లు స్పష్టం చేశారు.

కలెక్టరేట్ నుంచి ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణ

- నిరంతరం పనిచేస్తున్న ఆరు విభాగాలు
- కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం
- ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదుల స్వీకరణ
- సువిధ యాప్ ద్వారా ప్రచార అనుమతులు
- ఎన్నికల ఖర్చు మోనిటరింగ్‌కు ప్రత్యేక సెల్
- వెబ్‌కాస్టింగ్ ద్వారా చెక్‌పోస్టుల పర్యవేక్షణ

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 7: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడతుండడంతో కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. దీనిలో ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదులు స్వీకరించి ఫ్లైయింగ్ స్క్వాడ్, ఆర్వోలకు పంపించి తక్షణమే పరిష్కరించడానికి ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల కంట్రోల్ రూంకు ఒక డిప్యూటీ కలెక్టర్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించారు. 15మంది వివిధ డిపార్ట్‌మెంట్ల ఉద్యోగులు నిరంతరం పని చేస్తున్నారు. ప్రధానంగా ఆరు విభాగాలు ఇక్కడ పని చేస్తున్నాయి. కాకినాడ కలెక్టరేట్ కంట్రోల్ రూం నెంబర్లు 0884-2346599, 0884-2346399లకు ఫిర్యాదు చేయాలి.

సీవిజిల్ యాప్ విభాగం



దీనిలో సీవిజిల్ యాప్ విభాగానికి అధికార పార్టీకి చెందిన బ్యానర్లు, హోర్డింగ్‌లను నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుపై ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిని ఫ్లైయింగ్ స్క్వాడ్స్‌కు సమాచారమిచ్చి వంద నిమిషాల్లో పరిష్కరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. సీవిజిల్ యాప్‌కు వచ్చే ఎలాంటి ఫిర్యాదునైనా వంద నిమిషాల్లో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ సెల్

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు వచ్చే ఫిర్యాదులను 24 గంటలలోపు పరిష్కరిస్తున్నట్లు కలెక్టరేట్ అధికారులు తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై వచ్చే ఫిర్యాదులను ఇక్కడ సిబ్బంది నమోదు చేసుకుంటారు. యుద్ధప్రాతిపదికన ఫ్లైయింగ్ స్క్వాడ్, ఆర్వోలకు పంపించి పరిష్కరిస్తారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘించే అభ్యర్థుల వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపిస్తున్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్ 1950

టోల్ ఫ్రీ 1950 ద్వారా ఓటు నమోదుకు సంబంధించిన అంశాలు అధికారుల దృష్టికి వస్తాయి. ఓటు చేర్పులు, మార్పులపై, కొత్త ఓటు నమోదు వంటి ఫిర్యాదులపై వివరిస్తారు. ఎపిక్ కార్డుల జారీపై సమాచారం అందిస్తారు. ఓటుకు సంబంధించిన ఎలాంటి సందేహాలున్నా ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయాల్సి ఉంది. మృతిచెందిన వ్యక్తుల పేర్లు ఓటర్లు జాబితాలో నమోదై ఉంటే ఈ టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చును.

సువిధ యాప్..

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వాహనాల ర్యాలీ, ఇంటింటి ప్రచారం, ఇంటిపై బ్యానర్లు, స్టిక్కర్లు ఏర్పాటు వంటి అనుమతులను సువిధ యాప్ ద్వారా దరఖాస్తు చేయవచ్చు. వాటిని ఇక్కడ అధికారులు పరిశీలించి అనుమతి ఇస్తారు. అభ్యర్థులు దరఖాస్తు చేసిన 48 గంటల్లో అనుమతులు ఇస్తారు.

అభ్యర్థుల వ్యయంపై మోనటరింగ్ సెల్

ఎన్నికల్లో పోటీచేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల ఖర్చుకు సంబంధించి వివరాలను ఆడిట్ చేయడానికి ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కరపత్రాలు, హోర్డింగ్లు, బ్యానర్లు వంటి అన్ని ఖర్చులను ఇక్కడ నమోదు చేస్తారు. ఎన్నికల వ్యయం ఏ మేరకు అయ్యిందో ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి పంపిస్తారు. ఇలా ఏకకాలంలో అన్ని విభాగాలు పనిచేస్తున్నాయి.

చెక్‌పోస్టుల పర్యవేక్షణకు వెబ్‌కాస్టింగ్

కంట్రోల్‌రూంలో వెబ్‌కాస్టింగ్ ద్వారా చెక్‌పోస్టులను పర్యవేక్షించేందుకు టీవీలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న 8 చెక్‌పోస్టుల్లో ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఎలా తనిఖీలు చేస్తున్నారు వంటి అంశాలను వెబ్‌కాస్టింగ్ ద్వారా జిల్లాలో ఎన్నికల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

ఎన్నికలపై నిరంతర నిఘా: కలెక్టర్ నివాస్

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి నిరంతర నిఘా కొనసాగుతుందని కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్‌ల ద్వారా అక్రమ మద్యం, నగదు సీజ్ చేయిస్తున్నామన్నారు. కంట్రోల్ రూంకు వచ్చే ఫిర్యాదులను నిర్ణీత కాలపరిధిలో పరిష్కరిస్తున్నామన్నారు. ప్రచార అనుమతి కోసం సువిధ యాప్‌కు వచ్చే దరఖాస్తులను పరిశీలించి అభ్యర్థులకు అనుమతులు ఇస్తున్నామన్నారు. ఎన్నికల సంఘం నియమావళి ఉల్లంఘనపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించి కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

గుర్తింపు దక్కని గోపాలమిత్రలు



- వీరిని గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం
- జిల్లాలో 200మందికిపైగా గోపాలమిత్రలు
- టీడీపీ హయాంలోనే సరైన గుర్తింపు
- సచివాలయ వెటర్నరీ ఉన్నా వీరినే ఆశ్రయిస్తున్న రైతులు

గండేపల్లి, ఏప్రిల్ 7: గోపాలమిత్ర అంటే రైతులకు బాగా పరిచయమున్న పేరు. రైతు తమ పశువులకు ఏచిన్న వైద్య సహకారం కావాలన్నా వెంటనే గుర్తొచ్చేది గోపాలమిత్రలే. అటువంటి వీరికి వైసీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చలేదు. దీనికితోడు సచివాలయ వెటర్నరీ సిబ్బందిని నియమించి వీరిని పక్కన పెట్టేయాలనుకుంది. దీనిపై గోపాలమిత్రలంతా ఒక్కటై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో వైసీపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. 2001లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం చదువుకున్న నిరుద్యోగులకు పశువైద్యంపై శిక్షణ ఇచ్చి మూడు గ్రామాలకు ఒకరు చొప్పున పశువులకు వైద్యం అందించేలా గోపాలమిత్ర రూపంలో రైతులకు అనుసంధానం చేసింది. అప్పటినుంచి గోపాలమిత్రలు రైతులకు అందుబాటులో ఉంటూ రాత్రి, పగలు తేడా లేకుండా సేవలందిస్తున్నారు. అప్పట్లో రూ.2వేల వేతనం ఇచ్చేది. టీడీపీ అధికారంలోకి వచ్చాక వారి కష్టాలు గుర్తించి రూ.6500కు పైగా వేతనం పెంచడంతోపాటు పలు సౌకర్యాలు కల్పించింది. వైసీపీ 2019 ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే గోపాలమిత్రలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పిస్తామని, దీంతోపాటు మరికొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో చాలీచాలని జీతాలతో గోపాలమిత్రలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

న్యాయస్థానంలో పోరాటం

ప్రస్తుతం జిల్లాలో 200మందికిపైగా గోపాలమిత్రలు ఉన్నారు. సచివాలయంలో వెటర్నరీ సిబ్బందిని ఏర్పాటు చేసి ప్రభుత్వం గోపాలమిత్రలను తొలగించేందుకు ప్రయత్నం చేసింది. దీంతో గోపాలమిత్రలంతా కలిసి తాము ఎప్పటినుంచో సేవలు చేస్తున్నామని ప్రభుత్వానికి వ్యతిరేకంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించి వారి ఉద్యోగం నిలుపుకొన్నారు. ప్రభుత్వం వెటర్నరీ ఆస్పత్రుల్లో ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా నిలబెట్టుకోలేకపోయిందని గోపాలమిత్రలు తెలిపారు.

జీతాల పెంపూ లేదు

సచివాలయం వెటర్నరీ సిబ్బంది ఉన్నప్పటికీ రైతులుతమ పశువులకు ఏవిధమైన ఇబ్బంది ఏర్పడినా గోపాలమిత్రలతోనే వైద్యం చేయించుకుంటున్నారు. సచివాలయ వెటర్నరీ సిబ్బంది రైతులకు అందుబాటులో లేకపోవడం ఒక కారణమైతే, మరికొంతమంది సిబ్బందికి వైద్యంలో అనుభవం లేకపోవడం మరో కారణమని రైతులు చెప్తున్నారు. సచివాలయ వెటర్నరీ సిబ్బందికి దీటుగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం గోపాలమిత్రలు కూడా వైద్యసేవలందించడం విశేషం. కృత్రిమ గర్భధారణ వ్యాక్సిన్ వేయాలంటే సచివాలయ వెటర్నరీ సిబ్బంది దగ్గర పూర్తిస్థాయిలో పరికరాలు లేవని, అంత అవగాహన కూడా లేదని తామే చేయాల్సి వస్తుందని గోపాలమిత్రలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. అయినా కానీ టీడీపీలో పెంచిన జీతాలే తప్ప వైసీపీ ప్రభుత్వం ఎలా కూడా తమను ఆదుకోలేదని వారు ఆందోళన చెందుతున్నారు.

కూటూరు సంఘటనపై గిరిజనాగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వంతల

కూనవరం, ఏప్రిల్ 7: శనివారం జరిగిన వైసీపీ ప్రచారంలో కూటూరులో ఇద్దరు గిరిజనులు గాయాలపాలుకావడంతో గిరిజన సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అధికార మత్తులో వైసీపీ నాయకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అమాయక గిరిజనులపై దాడి చేయిస్తున్నారన్నారు. జరిగిన సంఘటనపై ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సంఘటనపై గిరిజనులంతా ఏకం కావాలని ఎమ్మెల్సీ అనంతబాబుపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి కుంజా అనిల్ ప్రకటించారు. బీజేపీ నాయకులు పాయం వెంకయ్య సైతం కూటూరు సంఘటనపై పూర్తి విచారణ జరిపిం చి దోషులను శిక్షించాలన్నారు. టీడీపీ

● ఎన్నికల కమిషన్ విచారణ జరిపించాలని డిమాండ్

నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి మాట్లాడుతూ కేసు ను పోలీసులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇద్దరు గిరిజనులకు తీవ్ర గాయాలైనప్పటికీ తోపులాటలో గాయమైనట్లు చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని వంతల విమర్శించారు. సంఘటనపై డీజీపీకి ఫిర్యాదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పొడియం అప్పారావు, గడేసుల ప్రేమ్‌చంద్, రసూల్, వెంకటేష్, మహిళా నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గిరిజన నాయకులు

ఎమ్మెల్సీ, పోలీసులపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు

రంపచోడవరం ఏప్రిల్ 7: ఎన్నికల ప్రచారం పేరుతో రాత్రి పూట ఆదివాసీ గ్రామాల్లో గొడవలు పెడుతున్న వైసీపీ ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు కారం సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కూనవరం మండలంలోని కూటురు గ్రామంలో ఎమ్మెల్సీ ప్రచారానికి వెళ్లగా వైసీపీ పాలనలో తమ సమస్యలు పరిష్కారం కాలేదని ప్రశ్నించిన అమాయక గిరిజనులపై అనంత బాబు అనుచరులు, పోలీసులు దాడి చేయడం దారుణమని కారం సురేష్‌బాబు అన్నారు. ఎమ్మెల్సీ అనంతబాబు కండిషనల్ బెయిల్ రద్దు చేయాలన్నారు.

తుపాకులతో కొట్టించడం దుర్మార్గం

● బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి

రంపచోడవరం ఏప్రిల్ 7: కూనవరం మండలం కూటూరు గ్రామంలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ ప్రజల సమస్యలు తెలుసుకోవాల్సింది పోయి, ఆదివాసీ యువకులను తుపాకులతో కొట్టించడం దుర్మార్గం అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. వైసీపీ పాలకులకు దళితులు, ఆదివాసీలు అంటే చులకనా అని, హంతకుడికి ఎన్నికల కోడ్‌లో ప్రచారానికి అనుమతి లేకుండా చర్యలు తీసుకోవాలని సోళ్ల బొజ్జిరెడ్డి కోరారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు.

9 గ్యారెంటీలతో ఏపీకి న్యాయం

● ఏఐసీసీ అబ్జర్వర్ మనోజ్ చౌహన్, ఎంపీ అభ్యర్థి గిడుగు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 7: ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కాంగ్రెస్‌పార్టీ 9 గ్యారెంటీలతో న్యాయం చేస్తుందని ఏఐసీసీ రాష్ట్ర పరిశీలకుడు మనోజ్‌చౌహాన్ అన్నారు. రాజమహేంద్రవరం హోటల్ ఆనంద్ రీజెన్సీ పందిరి హాలులో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ప్రధాని మోదీ, అమిత్ షాలను ఎదుర్కొనే ఏకైక నాయకుడు రాహుల్‌గాంధీ అని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలందరినీ కాంగ్రెస్ నాయకులు కలవాలని, రాష్ట్రానికి జరిగిన అన్యాయం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు వివరించాలన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీ ప్రత్యేక హోదాను తీసుకురాలేపోయిందన్నారు. రాష్ట్రానికి న్యాయం చేసే పార్టీ కాంగ్రెస్ అన్నారు. రాజమహే ంద్రవరం లోక్‌సభ అభ్యర్థి గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసులం తామేనని జగన్ కేవలం వైఎస్ఆర్ ఆస్తికి మాత్రమే వారసుడని స్పష్టం చేశారు. దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్లు సుంకర పద్మశ్రీ, జంగా గౌతమ్, ఎస్ఎన్ రాజా, రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, అనపర్తి అభ్యర్థి డాక్టర్ యళ్ల శ్రీనివాసరావు, రాజానగరం అభ్యర్థి ఎం.వెంకటశ్రీనివాస్, కొవ్వూరు అభ్యర్థి అరిగెల అరుణకుమారి, నిడదవోలు అభ్యర్థి పెదిరెడ్డి సుబ్బారావు, ఆమ్ ఆద్మీ పార్టీ నుంచి శ్రీనివాస్, సీపీఐ నుంచి కొండలరావు, సీపీఐ కార్యదర్శి ముళ్ళ మాధవ్, మార్టిన్ లూథర్, ఆకుల సూర్యభాగ్యలక్ష్మి, కృష్ణాజిల్లానాయకులు సంజీవరెడ్డి, కొత్తూరి శ్రీను, మట్టాప్రసాద్, రవి పాల్గొన్నారు.



సమైక్య అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వాడపల్లిలో ఘనంగా అధ్యయనోత్సవాలు

● గరుడ, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం



గరుడు, సింహ వాహనాలపై స్వామివారి గ్రామోత్సవం

ఆత్రేయపురం, ఏప్రిల్ 7: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో అధ్యయనోత్సవాలు ఆదివారం మూడోరోజుకు చేరుకున్నాయి. వసంత మండపంలో వేద పండితులు చతుర్వేద పారాయణ, ద్రవిడ వేద పారాయణలను ఘనంగా నిర్వహించారు. రాత్రి మేళతాళ, మంగళ వాయిద్యాలు, బాణసంచాకాల్పుల నడుమ గరుడ, సింహవాహనాలపై స్వామివారు తిరు వీధుల్లో భక్తులను కటాక్షించారు. చంగోలం పారాయణం శాస్త్రోక్తంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను ర్యవేక్షించారు.

నరసన్నకు హైకోర్టు జస్టిస్ పూజలు



హైకోర్టు జస్టిస్ రవినాథ్‌తిహారికి స్వామి ఫొటో అందిస్తున్న సూపరింటెండెంట్ విజయసారథి

అంతర్వేది, ఏప్రిల్ 7: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ రవినాథ్‌తిహారి ఆదివారం విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, స్వామివారి దర్శనం అనంతరం రవినాథ్ తిహారికి వేద పండితులచే మహదాశీర్వచనం జరిపించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయసారధి,రాజోలు జడ్జీలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రక్కు ఆటో

● ఎనిమిది మందికి గాయాలు

ముమ్మిడివరం, ఏప్రిల్ 7: ఆటోను వెనుక నుంచి ట్రక్కు ఆటో ఢీకొనడంతో ఏడుగురు ప్రయాణికులు, ఆటో డ్రైవర్ గాయపడ్డాడు. ఆదివారం ఉప్పలగుప్తం మండలం కూనవరం నుంచి యానాం శుభ కార్యక్రమానికి ఆరుగురు మహిళలు, ఓ వ్యక్తి ఆటోలో వెళ్తున్నారు. 216 జాతీయ రహదారి బొండాయికోడు పెట్రోల్ బంకు సమీపంలో ఆటోను వెనుక నుంచి ట్రక్కు ఆటో ఢీకొట్టింది. ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు నేలపాటి రమేష్‌బాబు-లోకుమారి, చల్లపల్లికి చెందిన కాగిత సుహాసినిలు తీవ్రంగా గాయపడగా, చల్లపల్లికి చెందిన కాగిత దుర్గారత్నం, బుంగా నర్సమ్మ, కూనవరానికి చెందిన బడుగు రాజేశ్వరి, కిత్తన చెరువుకు చెందిన జొన్నాడ ధనలక్ష్మి, కూనవరానికి చెందిన ఆటో డ్రైవర్ నేలపాటి చంటిబాబు గాయపడ్డారు. వీరిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యదేవుడి ప్రధానాలయం

ధ్వజస్తంభం తొలగింపు

● 15 గ్రాముల బంగారు, ఇతర లోహాలు లభ్యం

● నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో వేయాలని నిర్ణయం



పూర్తిగా తొలగించిన సత్యదేవుడి ఆలయ ధ్వజస్తంభం



ధ్వజస్తంభం అడుగుభాగంలో లభించిన బంగారం, తదితర లోహాలు

అన్నవరం, ఏప్రిల్ 7: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ప్రధానాలయంలో శిథిలావస్థకు చేరిన ధ్వజస్తంభం తొలగింపు ప్రక్రియను ఆదివారం పూర్తిచేశారు. అడుగుభాగంలో సుమారు 15 గ్రాముల బంగారం ఇతర లోహాలు లభ్యమయ్యాయి. వీటిని కొత్తగా లోహాలతోపాటు నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన రోజున అడుగుబాగంలో వేయనున్నట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. ఈనెల 18 నుంచి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ప్రారంభమై 22న ప్రతిష్ఠించనున్నారు. సుమారు రూ.4కోట్ల వ్యయంతో నెల్లూరుకు చెందిన ఒక దాత అందించనున్నారు. నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకలు ఘనంగా చేపట్టాలని నిర్ణయించారు. ఈకార్యక్రమానికి దేవదాయశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌ను ఆహ్వానించనున్నట్లు ఆలయవర్గాలు వెల్లడించాయి. భక్తులు, గ్రామస్థులు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు విచ్చేయాలని అధికారులు కోరారు. మరో వందేళ్ల వరకు ఇటువంటి కార్యక్రమం జరగనందున అధికసంఖ్యలో భక్తులు విచ్చేస్తారని అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉగాది వేడుకలకు సత్యదేవుడి ఆలయం ముస్తాబు

● పంచాంగ పఠనం ఇతర వైదిక కార్యక్రమాలు

అన్నవరం, ఏప్రిల్ 7: ఈనెల 9న క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం పురస్కరించుకుని అన్నవరం సత్యదేవుడి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటుచేసినట్లు ఆలయ ఈవో రామచంద్రమోహన్ తెలిపారు. వేకువజామున సుప్రభాతసేవ అనంతరం స్వామి, అమ్మవార్లకు అభ్యంగన స్నానమాచరింపచేసి నూతన పట్టువస్త్రాలను ధరింపచేసి ఉదయం 9గంటలకు పంచాంగ ఆవిష్కరణ, 9.30కి గొల్లపల్లి సుబ్రహ్మణ్య ఘనాపాఠిచే పంచాంగ శ్రవణం, 10గంటలకు ఉగాది పచ్చడి వితరణ గావించి 5గురు పండితులకు ఉగాది పురస్కారాలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కళామందిరంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, 11గంటలకు వెండి రథంపై స్వామి,అమ్మవార్ల ఊరేగింపు, రాత్రి 7గంటలకు కొండదిగువ వెండిగజవాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు.

సత్యదేవుడి ఆలయ విశిష్టత, వైదిక కార్యక్రమాలపై

డాక్యుమెంటరీ చిత్రీకరణకు ఉత్తర్వులు

అన్నవరం, ఏప్రిల్ 7: అన్నవరం సత్యదేవుడి ఆలయ విశిష్టత, నిత్యం జరిగే వైదిక కార్యక్రమాలపై డాక్యుమెంటరీ చిత్రీకరించాలని దేవదాయ కమిషనర్ ఆదేశాల మేరకు ఈవో రామచంద్రమోహన్ ఆదివారం చిత్రీకరణ సంస్థకు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని ఆదిరాజు సినీక్రియేషన్స్ సంస్థ చిత్రీకరిస్తోంది. డిజిటల్ ఫార్మట్‌లో సుమారు 20 నిమిషాల నిడివితో వీటిని చిత్రీకరిస్తామని నిర్మాణ సంస్థ డైరెక్టర్ కార్తీక ఆదిరాజు తెలిపారు. ఆలయంలో జరిగే నిత్య కార్యక్రమాలతో పాటుగా ప్రతీ సంవత్సరం ఆలయంలో నిర్వహించే పండుగలు, బ్రహ్మోత్సవాలు, తెప్పోత్సవం, గిరిప్రదక్షణ, రత్నగిరిపై ఉన్న ఉపాలయాలు, స్వామివారి ప్రసాదం విశిష్టత, తదితర అంశాలను చిత్రీకరించనున్నట్లు ఆమె తెలిపారు. గతంలో సింహాచలం ఆలయ విశిష్టత డాక్యుమెంటరీని తమ నిర్మాణ సంస్థ చిత్రీకరించిందన్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు తదితరులు ఉన్నారు.



డాక్యుమెంటరీ చిత్రీకరణకు ఉత్తర్వులు అందజేస్తున్న ఈవో రామచంద్రమోహన్

రంపచోడవరం అభ్యర్థిని మార్పు ఉండదు

● అధిష్ఠానం నిర్ణయం మేరకు క్యాడర్ సమన్వయంతో ముందుకెళ్లాలి

● రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు

ఎటపాక, ఏప్రిల్ 7: రంపచోడవరం ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మార్పు ఉండదని, త్వరలో అభ్యర్థి మార్పు జరుగుతుం దంటూ వస్తున్న వదంతుల్లో వాస్తవం లేదని టీడీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీల కుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ మేరకు అయన గుండాల కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత (2019) ఎన్నికల్లో జరిగిన తప్పు ఒప్పులను పరిగణనలోకి తీసుకుని, ఈ సారి అభ్యర్థిని విషయంలో పార్టీ అధి ష్ఠానం నిర్ణయం తీసుకుందని చెప్పా రు. రెండు రోజుల కిందటే అధినేత చంద్రబాబు ఈ విషయం తెలియజేయాలని తనకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పార్టీలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వేరే అభ్యర్థిని ప్రకటిస్తారని ప్రచారం చేస్తున్నారని , అందులో నిజంలేదని తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు నియోజకవర్గంలో క్యాడర్ అంతా సమన్వయంతో పనిచేస్తూ మిరియాల శిరీషాదేవీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబు అన్ని అంశాలను బేరీజు వేసుకుని, అభ్యర్థిని విషయంలో తుది నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. ఈసారి టీడీపీ గెలుపు అవకాశమున్న ఈ ప్రాంతంలో గ్రూప్ వర్గాలతో పనిచేస్తే, పార్టీకి నష్టం వాటిల్లుతుందని, అటువంటి నాయకులు, కార్యకర్తలపై పార్టీ అధిష్ఠానం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. పార్టీకోసం కష్టపడిన వారికి, గుర్తింపు ఉంటుందని, పార్టీ అధికారంలోకి రాగానే గుర్తింపునకు తగిన న్యాయం జరుగుతుందని చెప్పారు. 15 ఏళ్ల తర్వాత ఈసారి ఎన్నికల్లో రంపచోడవరం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరావు, పార్టీ సీనియర్ నాయకులు కిలారి వెంకటేశ్వరరావు, మాజీ వైఎస్ ఎంపీపీ రావిమాధవ రావు, సీనియర్ నాయకులు నలజాల శ్రీకాంత్ చౌదరి, బొల్లా పుల్లయ్య, ఏలూరి వెంకన్న, బాచినేని మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసరావు

పిఠాపురంలో ఉమ్మడి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, ఏప్రిల్ 7: కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్చరీ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 50మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. ఇండియన్ రౌండ్ విభాగంలో సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో విజేతలకు పతకాలు, బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పోటీలను ప్రారంభించి పర్యవేక్షించిన వారిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావు, రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, సీహెచ్‌వీ రమణ, కె.చిన్నబ్బాయి, జి.శివప్రసాద్, బి.సతీష్, పి.సాయి ఉన్నారు.



ఆర్చరీ పోటీల్లో విజేతలైన క్రీడాకారులు

దున్నపోతుతో తొక్కిస్తే.. పాపాలు పోతాయట!

● పోలేరమ్మ జాతరలో వింత ఆచారం ● అంతా మంచి జరుగుతుందనే నమ్మకం

అమీనాబాద్(కొత్తపల్లి), ఏప్రిల్ 7: దున్నపోతుతో తొక్కించుకుంటే పాపాలు పోతాయన్నది కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాదు మత్స్యకారుల నమ్మకం. దీనిలో భాగంగా ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతరలో ఈ వింత ఆచారంతో గ్రామస్తులు దున్నపోతుతో తొక్కించుకుని ఆనందపరవశ్యులయ్యారు. జాతర ముందురోజున ఇలా దున్నపోతుతో తొక్కించుకుంటే అంతా మంచి జరుగుతుందనే నమ్మకంతో పోటీలు పడ్డారు. వందలాది మంది మత్స్యకారులు ఇందులో పాల్గొన్నారు.



దున్నపోతుతో తొక్కించుకుంటున్న మత్స్యకారులు

నూకాంబికా జాతర ఉత్సవాలు ప్రారంభం



ఆలమూరు, ఏప్రిల్ 7: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా ఆలమూరు మండలం చింతలూరులో నూకాంబికా అమ్మవారి జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చంటి పిల్లలతో కాగడాలు వేయించడంతో పాటు తుళ్లబిళ్ల, వారపోయుట, కావిడి కోళ్ల మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకోవడానికి ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు ఈవో ఎంఎస్ఆర్ కృష్ణ తెలిపారు. జాతరలో విద్యుత్ కాంతులు ఆకట్టుకున్నాయి. ఉత్సవాలు సజావుగా జరిగేందుకు ఆలమూరు ఎస్ఐ శ్రీను నాయక్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేశారు.చింతలూరు నూకాంబికా అమ్మవారికి భక్తులు 20కిలోలతో వెండి ఆభరణాలు తయారు చేయించారు. స్థానిక భక్తుల సహకారంతో సేకరించిన వెండిహారంతో పాటు చేయించిన పలు ఆభరణాలను ఉత్సవాల సందర్భంగా ఆదివారం అలంకరించారు.

ఆకట్టుకున్న ఆర్ట్ ఎగ్జిబిషన్

పెద్దాపురం, ఏప్రిల్ 7: పెద్దాపురంలోని స్థానిక శ్రీప్రకాష్‌లో సినర్జీస్ పాఠ శాలలో హరివిల్లు కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిర్వ హించిన ఆర్ట్ ఎగ్జిబిషనర్ ఎంతగానో ఆకట్టుకుంది. ఎగ్జిబిష న్‌లో భాగంగా దేశంలో పలు రాష్ట్రాల్లో ఉన్న సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారాలు, పండుగలు తదితర విషయాల ను చిన్నారులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాల లో హరివిల్లు పేరుతో ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషాన్ని కలిగించిందన్నా రు. కార్యక్రమంలో ఆకడమిక్ కల్చరల్ కోఆర్డీనేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు



లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి 1.59 లక్షల ఆదాయం

తుని రూరల్, ఏప్రిల్7: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తుల కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారి దర్శనార్థం ప్రత్యేక క్యూలైన్‌లో బారులుతీరిన భక్తులు తల్లిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటుచేసిన వసతిగదులు, షెడ్‌లలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ఆదివారం ఒక్కరోజే వివిధ విభాగాలద్వారా ఆలయానికి రూ.1.59లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈవో స్పష్టం చేశారు.

ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో

ఏ1 నిందితుడి అరెస్ట్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7: కాకినాడజిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో ఆదివారం ఏ1 నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో అరెస్ట్ చేసిన నిందితుల సంఖ్య 5కు చేరింది. ఉత్తరకంచి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంక్‌లో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన దుండగులు చోరీకి పాల్పడి భారీ ఎత్తున బంగారం, నగదును దోచుకున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి పలుబృందాలను ఏర్పాటుచేసి ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మార్చి7న ఈ కేసులో నలుగురు వ్యక్తులను ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ లతాకుమారి, సీఐ శేఖర్‌బాబు, ఎస్ఐ పవన్‌కుమార్‌లు బృందాలు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఉన్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహ్మద్ సావేత్ హసన్‌ను ఆదివారం అరెస్ట్‌చేసినట్లు స్థానిక పోలీసులు తెలిపారు.

కాకినాడ

ఈవీఎంల స్టోరేజ్ రూమ్‌ల పరిశీలన

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7: ప్రత్తిపాడులోని మినర్వా కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, ఈవీఎంల స్టోరేజ్ రూమ్‌లను ఆదివారం కలెక్టర్ నివాస్ పరిశీలించారు. ఈవీఎం స్టోరేజ్, పోలింగ్ సిబ్బంది సామాగ్రి అందించే కౌంటర్ల ఏర్పాట్లపై ఆర్వో ఎ.శ్రీనివాస్‌ను ఆరా తీశారు. నియోజకవర్గంలో 227 పోలింగ్ కేంద్రాలకు మినర్వా కళాశాలలో సామగ్రి డిస్ట్రిబ్యూషన్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల వద్ద మంచినీటి సదుపాయం

కాకినాడ ఆర్వో వెంకటరావు



కాకినాడ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 7: ఎన్నికలకు ముందురోజు, అదేరోజు ప్రతీ పోలింగ్ స్టేషన్ వద్ద పూర్తిస్థాయిలో మంచినీటి సదుపాయం కల్పించాలని ఆర్వో జె.వెంకటరావు ఆదేశించారు. ఈ అంశంపై ఇంజనీరింగ్, వాటర్‌వర్క్స్ అధికారులతో ఆయన సమీక్షించారు. 233 పోలింగ్‌స్టేషన్ల వద్ద విధి నిర్వాహణలో ఉండే ఎన్నికల సిబ్బందితో పాటు ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లకు కూడా నీరు సమృద్ధిగా అందించాలన్నారు. ఆమేరకు ఆయా పోలింగ్‌స్టేషన్ పరిధిలో అందుబాటులో ఉన్న ఆర్వో ప్లాంట్లను వెంటనే గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి మ్యాపింగ్ ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్‌వో డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు జిలానీ, రాంబాబు ఉన్నారు.

కూటమిని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు

పిఠాపురం, ఏప్రిల్ 7: కులమతాల మధ్య తేడా తెలియకుండా, అన్ని సామాజిక వర్గాలతో మమేకమై విశాల దృక్పథంతో పెరిగిన కుటుంబం తమదని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు తెలిపారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం పట్టణానికి చెందిన 20మంది ఎస్సీ సామాజికవర్గ యువకులు జనసేనలో చేరారు. వారందరికి నాగబాబు జనసేన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ అఘాత్యాలు, అరాచకాలు తట్టుకోలేక జనసేన, తెలుగుదేశం, బీజేపీ కూటమిని గెలిపించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పిఠాపురం నియోజకవర్గంలో పవన్‌కల్యాణ్ గెలుపుకోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పార్టీని బలోపేతం చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు. వీరమహిళల విభాగం ఉభయగోదావరి జిల్లాల సమన్వయకర్త చల్లా లక్ష్మీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మర్రెడ్డి శ్రీనివాస్, ప్రొఫెసర్ కె.శరత్‌కుమార్, తుమ్మలపల్లి సాయి చంద్రశేఖర్, ఏడిద రాము, కాండ్రకోట ప్రసాద్ తదితరులున్నారు.

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ పున్నారావుకు నివాళి



పున్నారావు చిత్రపటానికి నివాళి

పిఠాపురం, ఏప్రిల్ 7: దేశ రక్షణలో అమరులైన వీరుల త్యాగం చిరస్మరణీయమని పలువురు వక్తలు అన్నారు. సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్సుకు చెందిన షహీద్ కానిస్టేబుల్ తోట పున్నారావు 2014 ఏప్రిల్ 17న చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మావోయిస్టులు జరిపిన ఐఈడీ పేలుడులో ప్రాణాలు కోల్పోయారు. ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ పిఠాపురం రథాలపేటలోని బీసీఎం స్కూలు ఆవరణలో ఆదివారం అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. పున్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పున్నారావు నివసించిన రథాలపేట ప్రాంతంలో పోలీసు, సీఆర్పీఎఫ్ అధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. పున్నారావు తల్లిని తోట సన్యాసమ్మను సత్కరించారు. కార్యక్రమంలో పిఠాపురం సీఐ పి.శ్రీనివాసరావు, పట్టణ ఎస్ఐ మురళీమోహన్, ఎంఈవో ఆర్.వరప్రసాద్, సీఆర్పీఎఫ్ ఏఎస్ఐ పి.రమేష్, యూత్ లీడర్ రమణ, ఏఐఎం ప్రతినిధులు చిల్లి నూకరాజు, మాతా నాగేశ్వరరావు, దడాల రామారావు పలువురు ఎన్‌సీసీ విద్యార్థులు, అధికారులు ఉన్నారు.

'ముస్లింల ప్రార్థనలు అందరికీ ఆదర్శం'

కాకినాడ సిటీ, ఏప్రిల్ 7: క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అని, ముస్లింలు నెల రోజులపాటు చేసే నమాజు, కఠోర ఉపవాసం వల్ల మరింత శక్తి, నిగ్రహం ఏర్పడుతుందని కాకినాడ సిటీ అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా స్థానిక సాంబమూర్తినగర్ హబీబియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో కొండబాబు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవాళి సుఖశాంతులతో ఉండాలని రంజాన్ మాసంలో ముస్లింలు చేసే ప్రార్థనలు అందరికీ ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జిలాని, షరీఫ్, మైనారిటీ నాయకులు ఎంఏ తాజుద్దీన్, ఎస్‌కే బాబులు, ఎస్‌కే రహీమ్, ఆశ్రిఫ్ అలీ, ఎండీ ఖాన, ఎండీ అన్సర్, సిరాజుద్దీన్, ఎండీ గౌస్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

'మహిళల కోసం అంబేడ్కర్ పోరాటం'

జగ్గంపేట, ఏప్రిల్ 7: స్త్రీ విమోచకుడు అంబేడ్కర్ అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి పులి ప్రసాద్ అన్నారు. జగ్గంపేట హైస్కూల్ అంబేడ్కర్ విగ్రహం వద్ద విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశంలో అన్ని రంగాల్లో పురుషులతో పాటు స్త్రీలకు సమాన హక్కులు కావాలని, వాళ్లు కూడా స్వేచ్ఛగా జీవించాలని మహిళల కోసం అంబేడ్కర్ పెద్ద ఎత్తున పోరాటం చేశారన్నారు. ఆర్‌పీఐ ఉభయగోదావరి జిల్లాల మహిళా అధ్యక్షురాలుగా ఉల్లం నందిని దేవి నియమించామన్నారు. దళిత మోర్చ జిల్లా నాయకులు కొత్తపల్లి సూరిబాబు, మహిళ నాయకులు సత్యవతి, చిన్నయమ్మ, అప్పయ్యమ్మ తదితరులున్నారు.

ప్రొఫెసర్ నరసింహారావుకు డాక్టరేట్

గండేపల్లి, ఏప్రిల్ 7: సూరంపాలెంలోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యూమానిటీస్ అండ్ బేసిక్ సైన్సెస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న ఐ.నరసింహారావు ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్టు ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లమిల్లి సతీష్ రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ జీవీఎస్ఆర్ ఆంజనేయులు నేతృత్వంలో ఆల్ఫాలాగరిథమ్ ట్రాన్స్‌ఫార్మ్ సెమీ లాజిస్టిక్ డిస్ట్రిబ్యూషన్ కోసం వివిధ కంట్రోల్‌చార్ట్‌లపై అధ్యయనం అనే అంశంపై ఆయన సమర్పించిన థిసిస్‌కు డాక్టరేట్ పొందారన్నారు. ఐ.నరసింహారావును విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్‌మేడపాటి శ్రీనివాస రెడి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రమేష్, డీన్ పీఎస్ రవికుమార్, హ్యూమానిటీస్ అండ్ బేసిస్ సైన్సెస్ విభాగాధిపతులు బి.జ్యోతి, అభినందించారు.

సాగునీరు అందివ్వాలని రైతుల ఆందోళన

తాళ్లరేవు, ఏప్రిల్ 7: గాడిమొగ కాలువపై జోడితూరల ప్రాంతానికి సాగునీరు అందివ్వాలని రైతులు ఆదివారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద అధికారులను నిలదీశారు. వారంరోజులుగా నీరందక పంటదగ్గరకు వచ్చిన వరిచేలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పోలేకుర్రు నీటిసంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో అధికారులతో రైతులు చర్చలు జరిపారు. 2 రోజుల్లో వంతు వస్తుందని, ప్రతీ ఒకరానికి సాగునీరందిస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

కరప, ఏప్రిల్ 7: కరప మండలం నడకుదురులో ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక యువకుడు మృతిచెందాడు. కరప పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... నడకుదురు సిద్దార్థనగర్ కాలనీలో గుండుపల్లి సత్తిబాబు అనే వ్యక్తి నివాసముంటున్నాడు. అతడి సోదరి నక్కా దేవి కువైట్‌లో ఉద్యోగం చేస్తుండగా, ఆమె కుమారుడు నక్కా ఇషాక్‌కుమార్(23) మేనమామ సత్తిబాబు వద్ద ఉంటున్నాడు. మతిస్థిమితం సరిగా లేని ఇషాక్‌కుమార్‌ను కాకినాడ, విశాఖపట్నం ఆసుపత్రులలో వైద్య చికిత్సలు అందించినా పూర్తిగా నయం కాలేదు. ఆదివారం తెల్లవారుజామున ఇషాక్ నడకుదురు కాలువలో స్నానం చేసి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. కాలువ వద్దకు వెళ్తుండగా వ్యవసాయమార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా గుర్తుతెలియని వాహనం అతడిని ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. తీవ్రంగా గాయపడిన ఇషాక్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి మేనమామ సత్తిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్టు ఏఎస్ఐ వి.సూరిబాబు తెలిపారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

సామర్లకోట, ఏప్రిల్ 7: సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామంలో షిర్డీసాయిబాబా ఆలయరోడ్డులో గల ఒక వైసీపీ నాయకుడి ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం పేకాట శిబిరంపై సామర్లకోట క్రైం బ్రాంచి పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.18,850ల నగదు స్వాధీనం చేసుకున్నామని సామర్లకోట ఎస్ఐ మౌనిక తెలిపారు.

నూకాలమ్మ జాతర మహోత్సవాలు

» జిల్లాలో పలుచోట్ల ప్రారంభం

» అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

» ఆలయాలకు విద్యుదీపాలతో అలంకరణ



పెద్దాపురం: కాండ్రకోటలో ప్రత్యేక అలంకరణలో నూకాలమ్మ అమ్మవారు



పిఠాపురంలో నూకాలమ్మ

పెద్దాపురం, ఏప్రిల్ 7: భక్తుల కొంగు బంగారం కాండ్రకోట నూకాలమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లా నుంచే కాక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున జాతర మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. జాతరలో భాగంగా కళ్లు మిరుమిట్లుగొలిపే బాణసంచాలు, వీనుల విందు చేసిన మ్యూజికల్ బ్యాండ్ భాజాభజంత్రీలు, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, రంగులరంగుల విద్యుత్ దీపాలంకరణలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. దేవస్థానం ఈవో టీవీ సూర్యనారాయణ, చైర్మన్ గవరసాన వీరాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధికంగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పిఠాపురం: పిఠాపురం పట్టణంలోని పెద్దబజారులో వేంచేసి ఉన్న నూకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. దూళ్ల వారి ఆడపడుచుగా, కొయ్యల వారి కోడలుగా ప్రసిద్ధిగాంచిన అమ్మవారి ఉత్సవాలు ఈనెల 28 వరకూ జరగనున్నాయి. జాతరలో భాగంగా తొలిరోజు సర్వదేవతా సమాజం సభ్యులు భజన కార్యక్రమాలు నిర్వహించారు. నటరాజ నృత్యనికేతన్ కళాకారులు అమ్మవారి ముందు కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన చేశారు. రాత్రి ఆలయం వద్ద నుంచి సంబరం ప్రారంభమైంది. ఇది సోమవారం ఉదయం వరకూ కొనసాగుతుంది. తీర్థం, జాతర సందర్భంగా సోమవారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివస్తూ ఉంటారు. ఇందు నిమిత్తం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు, మొక్కులు సమర్పించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

గొల్లప్రోలు: పట్టణంలో నూకాలమ్మ జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. జాతరలో భాగంగా ఉదయం, సాయంత్రం గరగ నృత్యాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి జాగారంలో భాగంగా భారీ ఊరేగింపు ప్రారంభమైంది. పురవీధులు గుండా ఇది సాగి సోమవారం ఉదయం తిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. సోమవారం జాతర, తీర్థం సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు, నైవేద్యాలు సమర్పిస్తారు. ఇందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. బస్టాండు, కరణంగారితోట, కొత్తపేట, చెందుర్తి, చేబ్రోలు నూకాలమ్మ తల్లి ఆలయాల వద్ద జాతర మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలంలో సోమవారం నూకాలమ్మ జాతర మహోత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు. ధర్మవరం నూకాంబిక అమ్మవారి ఆలయం వద్ద 13వ వార్షికోత్సవ జాతర మహోత్సవాలు సందర్భంగా ఆదివారం పూలగరగల సంబరం నిర్వహించారు. రాత్రి జాగారం, పూలగరగల సంబరం నిర్వహించారు. సోమవారం తీర్థం, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయం వద్ద రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నారు. ఒమ్మంగి, లంపకలోవ, ఉత్తరకంచి గ్రామాల్లో నూకాలమ్మ అమ్మవారి ఉత్సవ నిర్వహణకు ఏర్పాట్లు నిర్వహిస్తున్నారు.

ఏలేశ్వరం: మండలంలోని సిరిపురం, లింగంపర్తి గ్రామాల్లో నూకాలమ్మతల్లి జాతర మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తులు భారీగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తుండడంతో ఆలయాలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబుచేశారు. ఆలయాల వద్ద సంప్రదాయం ప్రకారం సోమవారం రాత్రి నూకాలమ్మకు ప్రత్యేక పూజలు, నవదుర్గా, కాళికామాతశక్తి వేశాలు, గరగల సంబరాలు, బాణసంచా కాల్పులు, పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలతో తీర్థం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

పోర్టుసిటీ (కాకినాడ): ఉగాది పండుగ పురస్కరించుకుని నగరంలో ప్రసిద్ధి చెందిన టు టౌన్ నూకాలమ్మ ఆలయం వద్ద కొత్త అమావాస్య వేడుకలను ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలతో ప్రారంభించారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నగర ప్రముఖులు కర్రి చినబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కొయ్య సత్యనారాయణరెడ్డి, బోర వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

తుని రూరల్: కొత్త అమావాస్య పురస్కరించుకుని మండలంలోని ఎస్.అన్నవరం, తేటగుంట, డి.పోలవరం, హంసవరం తదితర గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీలు సన్నద్ధమయ్యాయి. పోలీస్ అధికారులు గ్రామాల్లో ఉత్సవాలు వేళ అసాంఘిక కార్యక్రమాలకు చోటు లేకుండా తగు చర్యలు చేపట్టారు.



కాకినాడలో విద్యుదీపాలతో అలంకరించిన నూకాలమ్మ ఆలయం



గొల్లప్రోలులో నూకాలమ్మ ఆలయం

ఉమ్మడి ప్రభుత్వంతోనే పూర్తిస్థాయిలో రాష్ట్రాభివృద్ధి

పలుచోట్ల కూటమి అభ్యర్థుల ప్రచారం



గండేపల్లి: ప్రచారం చేస్తున్న నెహ్రూ, తాళ్లరేవు: చర్చిలో దాట్ల ప్రచారం, కొత్తపల్లిలో వర్మ ప్రచారం

గండేపల్లి, ఏప్రిల్ 7: రాష్ట్రం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రావాలని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో యర్రంపాలెం, కె.నాయకంపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. కూటమి అధికారంలోకి వచ్చాక రైతులను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మండలాధ్యక్షులు పోతుల మోహన్‌రావు, ముత్యాల భాస్కరరావు, ముత్యాల దుర్గారావు, టీడీపీ నేతలు సాయితేజ్, జాస్తి వసంత్, కందుల చంటిబాబు, కుంచే రాజా, ఇంచిన లక్ష్మణరావు, సుంకవిల్లి రాజు, బిక్కిన వెంకట్రావు, సుంకవిల్లి వీర వెంకట సత్యనారాయణ, గున్నా వీర వెంకట సత్యనారాయణ, సురేష్, భద్రం, ముత్యాల రాంబాబు, వలభిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

తాళ్లరేవు: భారతదేశంలో అన్నిమతాలు సమానమేనని, ఎవ్వరికి నచ్చిన మతం వారు స్వీకరించవచ్చని రాజ్యాంగం చెబుతుందని ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. ఆదివారం కొత్తకోరింగిలో ఉన్న చర్చిల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి ఓటర్లను అభ్యర్థించారు. రాజకీయ పదవుల కోసం మతాలను మార్చేసిన జగన్‌ని నమ్మవద్దన్నారు. క్రైస్తవల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని, టీడీపీని గెలిపించాలని కోరారు. చర్చి పాస్టర్లు ప్రార్థనలు చేసి బుచ్చిబాబును దీవించారు. పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సామర్లకోట: పట్టణ పరిధిలో 13వ వార్డు బలుసులపేట, ఇందిరా నగర్ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన టీడీపీ ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే చినరాజప్పతో బాటూ కాకినాడ ఎంపీ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ పాల్గొన్నారు. వైసీపీ అరాచక ప్రభుత్వ వైకరికి రానున్న ఎన్నికలలో తగిన గుణపాఠం చెప్పేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్దాపురం జనసేన ఇన్‌చార్జి తుమ్మల బాబు, బీజేపీ ఇన్‌చార్జి విత్తనాల వెంకటరమణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ వర్మ ఆదివారం కొత్తపల్లిలో ఇంటింట ప్రచారం నిర్వహించారు. పవన్‌తో పాటు కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపుతో రాష్ట్రం దశ మారుతుందని, అభివృద్ధి పథకంలో పయనిస్తుందన్నారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, రావు అక్షయ్ పాల్గొన్నారు.

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో కూటమి విజయం ఖాయమని, ఎన్డీఏ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలతోపాటు, యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ, జనసేన ఇంచార్జ్ వరుపుల తమ్మయ్యబాబు పేర్కొన్నారు. మండలంలోని పరిమితడిక, రమణయ్యపేట గ్రామాల్లో మీఇంటికి మీ సత్యప్రభ కార్యక్రమంలో భాగంగా సత్యప్రభ తనయుడు వరుపుల సాయి తర్విక్ రమణయ్యపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలువేసి నివాళులర్పించారు. కరపత్రాలు పంచుతూ ఇంటింటికీ వెళ్లి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తల్లి సత్యప్రభను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, వైభోగుల సుబ్బారావు, పెండ్ర శ్రీను, పలివెల శ్రీనివాస్, పెంటకోట శ్రీధర్, నూకతాటి ఈశ్వరుడు, చందువోలు సాయి రాజ్, సూతి వీరప్రభాకర్, పలువురు నాయకులు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జనసేన నేత, సాయిప్రియ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ కోరారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలు, నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటి వీరబాబు, గొల్లపల్లి శివబాబు, మొగలి శ్రీను, శాఖ సురేష్, రావుల వీరభద్రరావు, వట్టూరి శ్రీను, కోలా రమణ, వెలుగుల సత్యనారాయణ, రావుల తాతారావు ఉన్నారు.

'బుచ్చిబాబును గెలిపించుకుంటాం'

తాళ్లరేవు, ఏప్రిల్ 7: ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని గౌతమీగోదావరి పరివాహక ప్రాంతం గోవలంక, పిల్లంక, అరటికాయలంక, కొత్తకొంపలు, ఇంజరం లంక గ్రామాలకు చెందిన ఎస్సీ, బీసీలు ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. ఆదివారం ఇంజరం గ్రామంలో సాగి వెంకటసుబ్బరాజు, వేగేశ్న భాస్కరరాజుల అధ్యక్షతన ఎస్సీ, బీసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కార్మికులకు ఇసుక అందుబాటులోకి తీసుకువచ్చి వారి జీవనోపాధికి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకుంటామని పెద్దలు హామీ ఇచ్చారు. సమావేశంలో సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, మాజీ సర్పంచ్ మల్లికార్జునరావు, బీసీ, ఎస్సీ నేతలు జిత్తుక శ్రీనివాసరావు, మోర్త భైరవమూర్తి, బోయిడి వేణుగోపాల్, పోల్నాటి జయరామ్, కాత్రు విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీ సంఘ భవనానికి విరాళం

ప్రత్తిపాడు, ఏప్రిల్ 7: కాకినాడ జిల్లా బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యల్లపు బుల్లిరాజు ప్రత్తిపాడులో బీసీ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి రూ.5ల క్షలు విరాళం అందజేశారు. స్థానిక సంఘ కార్యాలయం వద్ద ఆదివారం ఆత్మీయ సమావేశంలో బుల్లిరాజు చెక్కును సంఘ జిల్లా నాయకులు ముచ్చు అప్పలరాజు, బొడ్డు శ్రీను, ఒమ్మి గంగరాజు, మెట్ల వీరాస్వామిలకు అందజేశారు. బులిరాజు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో నిరుపేదల నివాసానికి 20 ఎకరాల భూమిని పంపిణీ చేయనున్నట్టు ప్రకటించారు. జిల్లా నాయకులు ఎం.అప్పలరాజు, చిలపర్తి శ్రీనివాస్, పెండ్యాల శివశంకర్, కోసూరి లక్ష్మీనారాయణ, అవ్వ ఆదినారాయణ, వెలిపాక నాగు, ఎం.శ్రీను, బి.శ్రీను, మదినే నూకరాజు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న బుల్లిరాజు

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



సామర్లకోట: టీడీపీలో చేరుతున్నవారికి కండువాలు కప్పి అభినందిస్తున్న రాజప్ప

సామర్లకోట, ఏప్రిల్ 7: తెలుగుదేశం పార్టీలోకి సామర్లకోట మండలం పి.వేమవరం గ్రామానికి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు ఆదివారం సాయంత్రం చేరారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, ముసిరెడ్డి శ్రీరాములు, ముసిరెడ్డి రాంబాబుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మేడిది తమ్మిరాజు, శ్రీపతి సోంబాబు, మేడిది ప్రభాకరరావు, మేడిది ధర్మరాజు, రాఘవమ్మ తదితర కార్యకర్తలకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే చంద్రబాబును తిరిగి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా గెలిపించాల్సిన ఆవసరం అందరిపైనా ఉందని రాజప్ప చెప్పారు. టీడీపీ విజయానికి అందరు కృషి చేయాన్నారు. కూటమి నాయకులు తుమ్మల బాబు, విత్తనాల వెంకట రమణ, టీడీపీ మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాస్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు/రౌతులపూడి: ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయం వద్ద ఆదివారం రౌతులపూడికి చెందిన వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రౌతులపూడి టీడీపీ నాయకులు పైలా సాంబశివరావు ఆధ్వర్యంలో గుబ్బల నాగేశ్వరరావు, దమ్ము రాంబాబు, దమ్ము సత్యనారాయణ, దమ్ము సత్తిబాబు, పోశెట్టి శ్రీను, రాజు, సత్తిబాబు, నడిగట్ల అప్పారావు, గుబ్బల సూర్యవెంకటరమణ తదితరులు టీడీపీలోకి చేరారు. రౌతులపూడి మండలాధ్యక్షులు తమరాన సత్యనారాయణ ఉన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు పంచాయతీ గిడ్లవారిపేటకు చెందిన దళితులు వైసీపీని వీడి ముమ్మిడివరం ఉమ్మడి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు సమక్షంలో మురమళ్లలో టీడీపీలో వడ్డి విజయ్‌కుమార్ నాయకత్వంలో చేరారు. చేరినవారిలో అల్లంపల్లి చిన్న, సత్యనారాయణ, పోలినాటి అన్నవరం, లోవరాజు, నాని, అప్పారావు, బల్ల చిరంజీవి,జక్కుల వెంకటరమణ, శ్రీనివాసరావులున్నారు.

నర్మదా నది పుష్కరాలకు ఆహ్వానం

జగ్గంపేట, ఏప్రిల్ 7: టీడీపీ కార్యాలయంలో కాశీ క్షేత్రం నుంచి భూదాన మహాయజ్ఞం, కంఠరుష్యాఆశ్రమం వారు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూను కాశీ క్షేత్రంలోని కాశీ విశ్వేశ్వరుడి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందించి ఆశీస్సులు అందించారు. మే1 నుంచి 12 వరకు జరిగే నర్మదా నది పుష్కరాల్లో పాల్గొనవలసిందిగా ఆహ్వానించారు. రాష్ట్ర టీడీపీ ఎస్వీఎస్ అప్పలరాజును కాశీ విశ్వేశ్వరుడి చిత్రపటంతో ఆశీర్వదించారు. రామవరం మాజీ సర్పంచ్ మండపాక వెంకటాచలం, పంచాయతీ వార్డుసభ్యుడు మండపాకవెంకటేశ్వరరావు ఉన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు

పిఠాపురం, ఏప్రిల్ 7: పిఠాపురంలో రెవెన్యూ, పోలీసు అధికారులు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అగ్రహారంలో సీఎంసీ ఆసుపత్రి సమీపంలోని ఒక ఇంటిలో రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు సివిల్ సప్లైస్ డిప్యూటీ తహశీల్దార్ మర్రి వీరాస్వామి, అడిషనల్ ఎస్ఐ వెంకట్ తనిఖీలు నిర్వహించారు. 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి చెందిన కర్రి చక్రబాబు ఈ బియ్యాన్ని నిల్వ చేసినట్టు అధికారులు తెలిపారు.

దుర్గాడలో మాసశివరాత్రి పూజలు



ఉమారామలింగేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 7: గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో వేంచేసి ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి మహాన్యాస పారాయణ చేసి 11 రుద్రాలు, 21 రకాల ద్రవ్యాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామి, అమ్మ వార్లను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తులు పూజాది కార్యక్రమాలు నిర్వహించగా కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మున్సిపల్ మాజీ చైర్మన్ మృతి



సీతారామమూర్తి (ఫైల్)

కాకినాడ సిటీ, ఏప్రిల్ 7: కాకినాడ మున్సిపల్ మాజీ చైర్మన్ జ్యోతుల సీతారామమూర్తి (90) స్థానిక అపోలో హాస్పటల్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందారు. 1981 నుంచి 1986 వరకు, 1987 నుంచి 1992 వరకు ఆయన రెండు పర్యాయాలు మున్సిపల్ చైర్మన్‌గా సేవలందించారు. మొదటి పర్యాయం పరోక్ష పద్ధతిలోను, రెండవ పర్యాయం తెలుగుదేశం పార్టీ తరపున ప్రత్యక్ష పద్ధతిలోను ఆయన చైర్మన్‌గా ఎన్నికయ్యారు. స్థానిక శాంతినగర్‌లోని ఇంటి వద్ద సోమవారం ఆయన భౌతికకాయాన్ని సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం విజ్జపురెడ్డి స్మశాన వాటికలో ఆయన అంత్యక్రియలు జరుపనున్నారు.

'ఆదిత్య'లో అవగాహన సదస్సు

గండేపల్లి, ఏప్రిల్ 7: సూరంపాలెంలోని ఆదిత్య గ్లోబల్ స్కూల్‌లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రంగరాయ మెడికల్ కాలేజికి చెందిన డాక్టర్ పి.శ్రీనివాసన్, శ్రీరూపా యోగా స్పెషలిస్ట్ మై హెల్త్ మై రైట్ అనే థీమ్‌తో విద్యార్థులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ సంజయ్‌కుమార్ మాట్లాడుతూ రోజూ యోగా, క్రీడలకు తప్పనిసరిగా సమయం కేటాయించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ విజయభార్గవి, హెచ్‌ఓడీ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. ఆదిత్య యాజమాన్యం తరుపున ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు.

సమ్మర్ క్యాంప్ పోస్టర్ ఆవిష్కరణ

పెద్దాపురం, ఏప్రిల్ 7 : పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వచ్చే 7వ తేదీ నుంచి సమ్మర్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని పీసీసీ అధ్యక్షురాలు కూనిరెడ్డి అరుణ తెలిపారు. సమ్మర్ క్యాంప్ నిర్వహణకు సంబంధించిన గోడపత్రికను మిషన్ అన్నపూర్ణ సహాయ నిధి నిర్వాహకుడు దేవత రాజేష్‌కుమార్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సమ్మర్ క్యాంప్‌లో చిన్నారులకు డ్రాయింగ్, కరాటే, మ్యాథ్స్ స్పోకెన్ ఇంగ్లీష్, సైన్సు ప్రయోగాలు తదితర విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బుద్ధా శ్రీనివాస్, రొంగల అరుణ్, కెనడీ, మధుకుమార్, జయరాజు, చల్లా విశ్వనాథం తదితరులు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో విశేష పూజలు

సామర్లకోట, ఏప్రిల్ 7: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో వేదపండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, శ్రీనివాసరావు, వెంకన్న తదితరులతో భీమేశ్వర స్వామికి విశేష అభిషేకపూజలు, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచీ అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామి,అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయం ఆవరణలో నిత్యాన్నదాన పథకంలో సుమారు 600 మందికి అన్నదానం నిర్వహించగా ఆలయం వెలుపల భీమేశ్వరా అన్నదాన ట్రస్ట్ ఆవరణలో సుమారు 500 మందికి నిర్వహించారు.



సామర్లకోటలో విశేష అలంకారంలో భీమేశ్వర స్వామి